స్కెచ్ :

# ప్రెస్ రిపోర్టు

మానేపల్లి సత్యనారాయణ

రాజమండ్రి దగ్గర రైలు బ్రిడ్జిమీది మద్రాసు కలకత్తా మెయిలుకు ప్రమాదం సంభవించింది ఎక్కువ నీటిమట్టం లేక పోయినా, అతి జాగ్రత్తగా నడిపినాకూడా ఈ ప్రమాదం ఎలా సంభవించిందో ఇంజనీర్లకు అర్థంకాలేదు. పైపెచ్చు అది వుత్త మెయిలు కూడాకాదు. మొదటి పెట్టె స్పెషల్ అండ్ ఎయిర్ కండిషన్డ్. అందులో ఒక ప్రముఖ జాతీయ రాజకీయ నాయకుడు గారు ఎలక్షన్ల విషయంలో అర్జంటుగా ఎక్కడికో ఓట్లిమ్మని ఉపన్యాసం యిచ్చేందుకు - పయనిస్తున్నారు, బెర్తుపై శయనిస్తూ. యింజనూ, నాయకుడిగారి పెట్టె, మరో నాలుగు పెట్టెలూ, నదిలో పడిపోయినయ్. మిగతా వాటికి ప్రమాదం వాటిల్లలేదు అనేకమంది యింజనీర్లూ, ప్రజలూ, ప్రముఖులూ. పార్టీవాళ్ళూ పోగుపడి - ఆందోళన పడిపోతున్నారు. రేపు ఎలక్షన్లలో ఆయన నెగ్గుతాడని, అయినా - ఆయన పార్టీవాళ్ళుకూడా అంచనా వేసుకున్నారు. ఇంతలో . .

ఆయనింకా ఎవరికంటా పడలేదు.

♦ ♦ ♦

ఆ మర్నాడు తన పత్రికలో మొదటి పేజీలో, మొదటి వరుసలో పెద్దక్షరాలతో పడిన వార్త యిది.

ప్రముఖ రాజకీయవేత్త శ్రీ .. ....గారి హఠాన్మరణం. (స్వ. విలేఖరి - రాజమండ్రి) నేడు యిక్కడ 9 గం॥ 22 ని॥ లకు జరిగిన మెయిలు ప్రమాదంలో ప్రముఖ నాయకులు శ్రీ........గారు మరణించినట్టు అంచనా వేయబడ్డారు. పీడితుల సహాయార్థం, హైదరాబాద్‌నుండి రెండు హెలికాప్టర్లు వచ్చినాయి. 3 గం॥ 13 ని॥ లకు ఒక గజయీతగాడికి దొరికిన తలలేని శవాన్ని అతి జాగ్రత్తగా పరిశీలించి. ఈ విషయాన్ని ప్రకటించడమైనది. వివరాల కోసం, యింకా దర్యాప్తు సాగుతోంది....

ఈ సంగతి చదువుతున్న పాఠకులు రీడింగు రూంలో కూచుని సంతాపం తెలుపుతూ గొణగొణ లాడారు.

♦ ♦ ♦

వారం రోజులు గడిచినయ్ దేశం నాలుగు మూలలా కీ. శే శ్రీ ......గారి మరణానికి చాలామంది చాలా సంతాపం తెలుపుతూ, చాలా సభలు చేశారు

.. హఠాత్తుగా ఓరోజు తన పత్రికలో పడిన పతాక శీర్షిక యిది: శ్రీ . గారు సజీవంగా వున్నారు

.. ఫలానా తేదీనాడు, మరణించినట్టు ప్రకటింపబడిన యీ ప్రముఖ జాతీయ రాజకీయ వేత్త సజీవంగా వున్న వృత్తాంతం నేడిక్కడ తెలియవచ్చింది ఈ వార్త ప్రకటించేందుకు మాకు చాలా సంతోషంగా వుంది. చాలా గాయాలతో ఒక చిన్న చెక్క సహాయాన తేలుతో ఆయన యేదో తెలియని ఓ సముద్రపు టొడ్డుకు స్పృహతప్పి చేరారట. అక్కడి పల్లీయులు ఈయన దేహాన్ని తీసి శుశ్రూషలు చేయగా మూడు రోజులకు కొన్ని విషయాలు జ్ఞాపకం వచ్చాయట. తరువాత తాపీగా ఆయన కోలుకొని బయటపడి తమనుతాము తెలుపుకునేందుకు యింతకాలం పట్టింది.

త్వరపడి మొదట అలా ప్రకటించినందుకు మా పాఠకుల్నీ, శ్రీ....గార్నీ క్షమాపణ వేడుకుంటూ గాఢ పశ్చాత్తాపం పొందుతున్నాం.

(మిగతా వివరాలు రేపు ప్రకటించగలం- సం॥)

* * *

ఎలక్షన్లు జరిగి పోయినయ్....

ఫలితాలు ప్రకటిస్తూ! ఆరోపేజీ, ఆరో కాలం అడుగున "ఆయన గెలవలేదని ప్రకటించడానికి చింతిస్తున్నాం- స్వ. విలేఖరి" —— అని ప్రచురింపబడిన వార్త చాలా కొద్దిమంది మాత్రమే చూడగలిగారు.

ఈమధ్య ఆయన ఆరోగ్యంగా గడుపుతున్నారట!

---


## ప్రకటన

బందరు డిస్ట్రిక్టు మునసబుకోర్టులో

S. C 789/54 E. P. 896/60

వేముల లక్ష్మీపతిరావు D. H. R.

సమ్మెట కృష్ణయ్యకొడుకు
వెంకట కుటుంబరావు J. D. R.

కృష్ణా డిస్ట్రిక్టు కవుతరం సబురిజిష్ట్రారువారి యిలాకా ముక్కొల్లు గ్రామములో వున్నటువంటిన్ని యీ డిక్రీబాకీ క్రిందను జప్తు అయినటువంటిన్నీ ది 18-9-1961 తేదీన వేలము కానున్నటువంటిన్నీ J. D. R. స్వాధీన హక్కుభుక్తములలో అయివున్న స్థిరాస్థి వయినం:

తూర్పు : }
దక్షిణం : } సమ్మెట వెంకట కుటుంబరావుగారు
పడమర : }

ఉత్తరం: సమ్మెట పార్థసారధిగారు

యీ హద్దులమధ్య య 0 76 ట్లు శేరీపల్లం భూమి Upset Price Rs 600-00

Vemula Lakshmipathi Rao
D H. R. వాది


## ఈ విచిత్రం విన్నారా ?

అణువులో కేంద్రస్థానమైన న్యూక్లియస్ చుట్టూ, ఎలక్ట్రానులు. సెకనుకు కొన్ని కోట్ల సార్లు తిరుగుతూ ఉంటాయి. ఒక సువిశాలమైన ఇంటిలో ఒక కందిరీగ ఎంత స్వేచ్ఛగా తిరగ గలదో, ఈ ఎలక్ట్రానులు కూడా అంత స్వేచ్ఛగానూ, అణువులో తిరగ గలవు.